సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



విద్యార్థి మృతదేహం లభ్యం

హంద్రీ నీవా కాలువలో గల్లంతైన విద్యార్థి సాయికిరణ్ మృతదేహం బసినికొండ సమీపంలో లభ్యమైంది. ఫైర్ రెస్క్యూ టీం సాయికిరణ్ మృతదేహాన్ని బయటకు తీశారు. - 8లో



దీపం.. విభిన్న రూపం!

మరో వారం రోజుల్లో దీపావళి పండుగ రానుంది.మహిళలు దీపాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. వ్యాపారులు అనేక డిజైన్లలో దీపాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.230
రెండోరకం	రూ.130	రూ.180

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 144 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	610	610
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 49.320 కిలోలు

న్యూస్‌రీల్

ఒకే పాఠశాలలో టీచర్లుగా చేరిన అక్కాచెల్లెలు



విధుల్లో చేరిన అక్కాచెల్లెలుకు స్వీటు తినిపిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె సిటీ : డీఎస్సీలో ఎంపికైన అక్కాచెల్లెలు ఒకే పాఠశాలలో చేరిన అరుదైన సంఘటన ఇది. ములకలచెరువు మండలం బత్తాలాపురానికి చెందిన చంద్రమోహన్, సత్యవతి కుమార్తెలు జల్లా శ్రీలత, జల్లా హేమలతలు మెగా డీఎస్సీ రాశారు. ప్రతిభ కనబరిచి ఇద్దరు ఎంపికయ్యారు. కౌన్సెలింగ్‌లో మదనపల్లె హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఎంపిక చేసుకున్నారు. సోమవారం వీరిద్దరు పాఠశాలలో ఎస్ఏలుగా విధుల్లో చేరారు. వీరికి పాఠశాల హెచ్ఎం,ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు ఎగివింటి సుధాకర్, బెల్లం సుధాకర్, జయరాం, బార్గవి, శోభారాణి తదితరులు స్వాగతం పలికారు.

బాధితులకు న్యాయం చేయాలి

రాయచోటి : ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించడంలో అధికారులు ఏ మాత్రం అలసత్వం వహించకుండా చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లభించింది. అదనపు ఎస్పీ వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడారు. వారి నుంచి అర్జీలను స్వీకరించారు.సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

భూరీసర్వేపై అవగాహన కల్పించాలి

సిద్దవటం : భూ రీసర్వే పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని విజయవాడ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ టి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు.సోమవారం సిద్దవటం మండలంలోని కనుములోపల్లిలోని సర్వే నంబర్ 29, 30, 31లోని 12.05 ఎకరాల భూమిలో సర్వేయర్లు చేపట్టిన రీసర్వేను పరిశీలించారు. సంబంధిత రైతులు ప్రసాద్‌రెడ్డి, గౌస్‌బాషాలతో మాట్లాడారు. సర్వే సిబ్బంది రైతులకు నోటీసులు అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వే ల్యాండ్ అధికారి ఎ.మురళీకృష్ణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీలత, పోరభాకర్, మండల సర్వేయర్ సోమశేఖర్, సచివాలయ సర్వేయర్లు హరినాథ్, గురుసాయి, రవితేజ, కారుణ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి భక్తి శ్రద్ధలతో పల్లకీ సేవ నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవారి మూల విరాట్‌లకు ప్రధాన అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణయ్యస్వామి, శేఖర్ స్వాములు పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢవీధులలో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఆలయ ఈవో డివి రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్



సమస్యలు వింటున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

రాయచోటి : ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన బాధితులు కలెక్టర్, జేసీ, డీఆర్ఓలకు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, ఏడీ సర్వే భరత్ కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కదిలివచ్చి.. కదంతొక్కి

- నకిలీ మద్యం వ్యవహారంలో కీలక నేతలను అరెస్టు చేయాలి
- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణుల ర్యాలీలు, నిరసనలు
- ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రాలు
- సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్



రాజంపేట : నకిలీమద్యానికి వ్యతిరేకంగా మహిళల నిరసన

సాక్షి రాయచోటి : రాష్ట్రంలో నకిలీ మద్యం వ్యవహారంపై సిట్ కాకుండా సీబీఐ విచారణ జరపాలి.. ఎక్కడ చూసినా టీడీపీ నేతలే పట్టుబడుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలి.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాల్సి. మద్యం షాపులు దక్కించుకున్న టీడీపీ నేతలు అందులో ప్రయోజనం చాలదన్నట్లు మళ్లీ నకిలీ మద్యానికి తెర తీయడం ఎంతమాత్రం సమంజసం కాదు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే నకిలీ మద్యం తయారీ వ్యవహారం బయటికి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో సీబీఐ విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం రాష్ట్రంతోపాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు , ముఖ్యంగా మహిళలు నకిలీ మద్యం వ్యవహారంపై కదిలారు.ఎక్కడికక్కడ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ల వరకు నిరసనప్రదర్శనలు నిర్వహించి తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. గతంలో ఎప్పుడూ లేని తరహాలో అక్రమ మద్యం వ్యవహారం నడుస్తుండడంపై వారు మండిపడ్డారు.

రైల్వేకోడూరులో కొరముట్ల ఆధ్వర్యంలో

రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్యే కొరముట్లతోపాటు వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, పుల్లంపేట ఎంపీపీ బాబుల్‌రెడ్డి, రైల్వేకోడూరు మండల ఉపాధ్యక్షులు ధ్వజారెడ్డి, చిట్వేలి, ఓబులవారిపల్లె మండల కన్వీనర్లు చెవ్వు శ్రీనివాసులురెడ్డి, వత్తలూరు సాయికిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రేణులు కదిలివచ్చాయి. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్దకు ర్యాలీగా చేరుకుని నిరసన చేపట్టారు. ప్లకార్డులు చేతబూని, బ్యానర్లతో ముందుకు కదులుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు.

ములకలచెరువు, మదనపల్లెలో..

జిల్లాలోని మదనపల్లె, ములకలచెరువుల్లో పార్టీ శ్రేణులు, మహిళలతోపాటు మాజీ ప్రజాప్రతినిధులు నకిలీ మద్యంపై దండయాత్ర చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువులో పార్టీ శ్రేణులు, మహిళలు చెన్నై-ముంబయి (ఎంబీటీ) జాతీయ రహదారిలోని రైల్వే గేటు నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ....వెంటనే నకిలీ మద్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ నినదించారు. ములకలచెరువులోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద దాదాపు గంటకు పైగా ధర్నా అనంతరం సీఐ కిశోర్‌కు వినతిపత్రం సమర్పించారు. అలాగే మదనపల్లెలోని బెంగళూరు రోడ్డు నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు మదనపల్లె పార్టీ పరిశీలకులు నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ దేశాయి తిప్పారెడ్డి, చిత్తూరు జిల్లా పార్లమెంట్ పరిశీలకురాలు అనీషారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు షమీమ్ అస్లం, మున్సిపల్ చైర్ పర్సన్ మనూజారెడ్డిల నేతృత్వంలో వందలాది మంది కార్యకర్తలు, శ్రేణులు తరలివచ్చి ధర్నా నిర్వహించారు.సీబీఐతో విచారణ జరిపించాలని...గుడి, బడి పక్కన మద్యం షాపులను నిర్వహించరాదని డిమాండ్ చేస్తూ ఎక్సైజ్ సీఐ కిశోర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

రాజంపేట, రాయచోటిలలో నిరసన

రాజంపేట, రాయచోటిలలో పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. రాజంపేటలోని రాయచోటి రోడ్డులో ఉన్న ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్దకు నాయకులు, కార్యకర్తలు, మహిళలు కదిలివచ్చి ధర్నా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షురాలు మిరియాల సురేఖ, జిల్లా కార్యదర్శి రక్కసి శ్రీవాణి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్లు దండు గోపి, చంద్రలీల నేతృత్వంలో మహిళలు కదిలివచ్చి నిరసన చేపట్టారు. అలాగే జిల్లా కేంద్రమైన రాయచోటి ఎక్సైజ్ కార్యాలయం వద్ద మహిళలతోపాటు నేతలు నిరసన చేపట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహ్మాన్, జిల్లా మహిళా కార్యదర్శి సరియ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సీఐ గురుప్రసాద్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.



రాయచోటిలో ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు



మదనపల్లెలో ఎసైకు వినతిపత్రం ఇస్తున్న నిసార్, తిప్పారెడ్డి, అనీషారెడ్డి, షమీం, మనూజ



అధికారులకు వినతి పత్రం ఇస్తున్న కొరముట్ల తదితరులు



రైల్వేకోడూరులో మహిళా నాయకుల నిరసన



మదనపల్లెలో నకిలీమద్యంపై వైఎస్సార్‌సీపీ ర్యాలీ



ములకలచెరువులో ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కురబలకోటలో చిరుత కలకలం



ఎగువ చెన్నామర్రికి చెందిన రైతు పెంపుడుకుక్క కళేబరం

కురబలకోట : కురబలకోట మండలంలో చిరుత సంచారం కలకలాన్ని రేపింది. ఇటీవల మండలంలోని ఎగువ చెన్నామర్రి వద్ద పొలం వద్ద కాపలాగా కట్టిన కుక్కను రాత్రి వేళ చంపి తినేసింది. ఆదివారం రాత్రి కూడా అదే ప్రాంతంలో మరో కుక్కను మునుపటి తరహాలోనే చంపి చిరుత తినివేయడంతో ప్రజలు భయపడుతున్నారు. ఊరికి దూరంగా హార్సిలీహిల్స్ అటవీ ప్రాంత సమీపంలో పొలాలు ఉన్నాయి. నారాయణరెడ్డి అనే రైతు ఆదివారం రాత్రి పొలానికి కాపలాగా పెంపుడు కుక్కను కట్టేసి వచ్చాడు. సోమవారం ఉదయం వెళ్లి చూస్తే కుక్క చనిపోయి ఉండడం సగానికి పైగా తినేసి ఉన్న కళేబరాన్ని చూసి షాక్‌కు గురయ్యాడు. నెలక్రితం వచ్చిన చిరుతే ఇప్పుడు కూడా వచ్చి ఉంటుందని భావిస్తున్నారు. హార్సిలీహిల్స్ సెక్షన్ కాండ్లమడుగు బీట్ పరిధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న ఫారెస్టు అధికారులు సోమవారం ఉదయం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. గ్రామస్థులను అప్రమత్తం చేశారు. రాత్రి వేళ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. చిరుత అడుగులు, కదలికలను గుర్తించి దీన్ని పట్టుకోడానికి కేజ్ ట్రాప్స్ (బోను)తో బంధించే చర్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇందుకు ముందుగా ట్రాక్ చేస్తున్నట్లు తెలిపారు

అడవిలో తమ్ముళ్ల మట్టిదందా



ఘటనా స్థలంలో పట్టుబడిన జేసీబీ, టిప్పర్లు

సాక్షి టాస్క్ ఫోర్స్ : కూటమి నాయకుల అక్రమాలు, ఆగడాలకు అంతులేకుండా పోతోంది. కొండలు గుట్టలు చదును చేసి సొమ్ము చేసుకున్న తెలుగు తమ్ముళ్లు... తాజాగా అడవుల్లోని మట్టిని కూడా తవ్వేస్తున్నారు. రాజంపేట మండల పరిధిలోని కోనరాజు పల్లి పంచాయతీ అడవి ప్రాంతంలో అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు ఒక జెసీబీని అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అడవిలో తవ్వకాల వెనుక అసలు సంగతి ఏంటంటే..... తలసాని కుంటలో పంట పొలాలకు వేసుకునేందుకు మట్టిని తవ్వేందుకు ఇరిగేషన్ అధికారులు అనుమతులు ఇచ్చారు. దీన్ని సాకుగా చూపి అనుమతులు ఇచ్చిన చోటు కాకుండా అడవిలో తవ్వకాలు జరిపారు. దీంతో గ్రామస్తులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది అటవీ ప్రాంతంలోని మట్టిని తవ్వినట్లు నిర్ధారించుకున్నారు. మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు, జేసీబీ సీజ్ చేశారు. విషయాన్ని కడపలోని ఎఫ్ఆర్ఓ సుబ్బయ్య దృష్టికి తీసుకెళ్లారు. మట్టిని తరలిస్తున్న వ్యక్తులు కూటమి నాయకులు కావడంతో, రాజంపేట అధికార పార్టీకి చెందిన ముఖ్య నేత నుంచి వాహనాలు వదిలేయాల్సిందిగా ఫారెస్ట్ అధికారులపై ఒత్తిడి వచ్చింది. దీంతో పట్టుకున్న వాహనాలకు 40 వేల జరిమానా విధించి విడిచిపెట్టారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపిన తమ్ముళ్లపై చర్యలు తీసుకోకుండా వాహనాలకు జరిమానా విధించి వదిలేయడంపై ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

అటవీభూమిలో నిర్మాణం అడ్డగింత



అటవీభూమిలో చేపడుతున్న నిర్మాణాలు

మదనపల్లె రూరల్ : అటవీ భూమిలో కొందరు వ్యక్తులు దర్గా నిర్మిస్తున్నామంటూ పనులు ప్రారంభించడంతో సోమవారం రాత్రి మదనపల్లె మండలం చీకలబైలులో ఉద్రిక్తత నెలకొంది. ఫారెస్టు, పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణాలను అడ్డుకుని పరిస్థితి అదుపులోకి తెచ్చారు. మదనపల్లె మండలం చీకలబైలు గ్రామం, దొనబైలు దారిలోని పులిమానువంకవద్దనున్న అటవీభూముల్లో బండవద్దకు పట్టణంలోని ఈశ్వరమ్మ కాలనీ, కర్ణాటక రాష్ట్రం ముల్‌బాగల్‌కు చెందిన కొంత మంది మహిళలు, పది మంది పురుషులతో వాహనంలో అక్కడికి చేరుకున్నారు. పూజలుచేసి దర్గా నిర్మాణానికి పనులు ప్రారంభించారు. అయితే స్థానికులు పూజలు చేసుకుంటున్నారని భావించారు. అక్కడికి వెళ్లిన ఓ మహిళతో వారు ఇక నుంచి మీరు ఇక్కడ దుస్తులు ఉతకరాదని, ఈ ప్రదేశంలో దర్గా నిర్మాణం చేస్తున్నామంటూ చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న ఎగువపల్లె, చీకలబైలు, జమ్మికుంటపల్లె, దిగువపల్లె ప్రజలు చీకటి పడుతుండగా అక్కడికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అయితే తమకు దర్గా నిర్మాణానికి అనుమతులు ఉన్నాయంటూ చెప్పడంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. దీంతో స్థానికులు ఫారెస్టు ,తాలూకా పోలీసులకు సమాచారం తెలియజేశారు. ఫారెస్టు రేంజర్ జయప్రసాదరావు, ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఉమాదేవి , తాలూకా ఎస్.ఐ చంద్రమోహన్, సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. నిర్మాణ సామగ్రిని, దర్గా నిర్మాణ పనులుకు వచ్చి వ్యక్తులను, వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. గుమికూడిన స్థానికులను అక్కడి నుంచి పంపివేశారు. సాయంత్రం నుంచి రాత్రి 9.30 గంటల వరకు పోలీసులు అక్కడే పహారా కాశారు. చీకలబైలుకు చెందిన శ్రీనివాసులు, నాగమ్మ అనే వ్యక్తులకు సంబంధించి ఆరోగ్యం మెరుగుపడటానికి పూజలు చేసే పేరుతో ఇక్కడికి వచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై చుట్టుపక్కల గ్రామస్తులు మంగళవారం ఉదయం మరోసారి సమావేశం కానుననట్లు తెలుస్తోంది.

నేతన్నకు ఉత్తుత్తి విద్యుత్!

- ఉచిత విద్యుత్ హామీ ప్రకటనలకే పరిమితం
- అమలుపై మీనమేషాలు లెక్కిస్తున్న కూటమి ప్రభుత్వం



పవర్‌లూమ్స్ వద్ద చీర నేస్తున్న నేత కార్మికుడు (ఫైల్)

మదనపల్లె సిటీ: నేత కార్మికులకు ఉచిత విద్యుత్ జీఓ ఇచ్చి ఆరు నెలలు గడిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేనేతమగ్గాలు, పవర్‌లూమ్స్‌కు మంచి రోజులు వస్తాయని ఆశించారు. ప్రభుత్వం కొలువుదీరి ఏడాదిన్నర కావస్తున్నా విద్యుత్ బాదుడు కొనసాగుతూనే ఉంది. కంటి తుడుపుగా జీవో ఇచ్చి చేతులు దులుపుకోవడంతో నేతన్నలు మండిపడుతున్నారు.

- ఉచిత విద్యుత్ జీఓతో తమ కుటుంబాలకు కొంతైనా ఆర్థికభారం తగ్గుతుందనుకున్న నేతన్న జీవితాల్లో నిరాశే మిగిలింది. వ్యవసాయం తర్వాత చేనేత రంగం అతి పెద్ద ఉపాధిరంగం. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ రంగం ప్రస్తుతం దయనీయ పరిస్థితి ఎదుర్కొంటోంది. జిల్లా వ్యాప్తంగా 20 వేల కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడి ఉన్నాయి. మదనపల్లె (నీరుగట్టువారిపల్లె)లో సుమారు 12 వేల కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ ఎనిమిది వేలకుపైగా చేతి మగ్గాలు, మూడు వేలకుపైగా పవర్‌లూమ్స్ ఉన్నాయి. కలకడ, తంబళ్లపల్లె, నిమ్మనపల్లె, వాల్మీకిపురం, కురబలకోట, బి.కొత్తకోట, పుల్లంపేట, చిన్నమండ్యం, గాలివీడు,సుండుపల్లి, రాజంపేట, వీరబల్లి మండలాల్లో చేనేత కుటుంబాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో చేనేత మగ్గాల ధ్వని వినిపించడం తగ్గిపోతోంది. ఇందుకు వివిధ సుంకాల పేరిట పెరిగిన విద్యుత్ చార్జీలే ప్రధాన కారణం. గత మార్చి 26వ తేదీన ప్రభుత్వం విడుదల చేసిన ఉచిత విద్యుత్ జీవో నంబర్ 44 ఆరు నెలలు పూర్తయినా అమలు కాకపోవడంతో నేతన్నలు ఆందోళన చెందుతున్నారు. జాతీయ చేనేత దినోత్సవం రోజున కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. అయినప్పటికీ ఇది అమలు కావడం లేదు

జీవో అమలులో నిర్లక్ష్యం

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చాలంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ఒత్తిడి తీసుకువచ్చారు.దీంతో దిగివచ్చిన ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 28వతేదీన జీవో -44 విడుదల చేసింది. వాస్తవ సంఖ్య, చేతి మగ్గాలు, పవర్‌లూమ్స్ యూనిట్ల సంఖ్యను గణనీయంగా తగ్గించి జీవోను విడుదల చేసింది. చేనేత కుటుంబాలకు నెలకు రూ.200 యూనిట్లు, పవర్ లూమ్స్ యూనిట్లకు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించనున్నట్లు జీవోలో స్పష్టం చేశారు. అయితే ఆగస్టు 7 న జాతీయ చేనేత దినోత్సవం రోజున ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం గమనార్హం.

నేతన్నల డిమాండ్లు

- జీవో నంబర్ 44ను వెంటనే అమలు చేయాలి.
- రాష్ట్ర బడ్జెట్ నుంచి 10 శాతం 3,000 కోట్లు కేటాయించాలి
- నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలి.
- నూలు,సిల్క్‌లకు 50 శాతం రాయితీ ఇవ్వాలి
- చేనేత కుటుంబాలకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి
- గృహం, వర్క్‌షెడ్ పథకాన్ని అమలు చేయాలి.
- జీవిత బీమా సంస్థ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసిన బీమా పథకాన్ని కొనసాగించాలి.
- ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కార్మికులకు రూ.7లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.

ఆదుకున్న నేతన్న నేస్తం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం ద్వారా మగ్గం కలిగిన ప్రతి నేతన్నకు ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సహాయం అందించింది.జిల్లాలో 2021లో రూ.14,00,88,000, 2022లో రూ.14,68,32,000, 2023లో రూ.16,64,88,000 నేతన్న నేస్తం కింద అందించారు.

జీవో ఇచ్చారు.. మరిచిపోయారు



ఉచిత విద్యుత్ పేరిట జీఓ ఇచ్చి అమలు చేయకపోవడం దారుణం. పెరిగిన విద్యుత్ చార్జీలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మార్చి నెలలో జీఓ ఇచ్చారు. ఆగస్టులో అమలు చేస్తామని చెప్పారు. అక్టోబర్ వచ్చినా బిల్లులు చేతికిస్తున్నారు. -జీ.సుధాకర్, నేత కార్మికుడు, నీరుగట్టువారిపల్లె(మదనపల్లె)

ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలి



చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకం వెంటనే అమలు చేయాలి. ఆగస్టునెల నుంచి అమలు చేస్తామని ప్రకటించారు. బిల్లులు మాత్రం ఇస్తున్నారు. దీనిపై చేనేత కార్మిక సంఘాలతో కలిసి ఆందోళనలు చేస్తాం. ప్రభుత్వం వెంటనే దీనిని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలి. -శీలం రమేష్, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు

క్లుప్తంగా

మామపై కోడలి దాడి

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్లకు చెందిన వీరబల్లి సహదేవరెడ్డిపై కోడలు తేజస్విని, ఆమె తమ్ముడు లోకేశ్వర్‌రెడ్డి సోమవారం దాడి చేశారు. పోలీసుల వివరాల మేరకు సహదేవరెడ్డి, కోడలికి మధ్య మాటా మాటా పెరగడంతో ఈ దాడి జరిగింది. సహదేవరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తిరుపతికి తీసుకెళ్లారు. బాధితుడి కొడుకు వీరంరెడ్డి ఫిర్యాదు మేరకు సంబేపల్లె పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

సిద్దవటం : కార్తీకమాసంలో శ్రీ నిత్యపూజ స్వామి కోనకు వచ్చే శివ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఆలయం ఇన్‌చార్జి ఈఓ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని వంతాటిపల్లి గ్రామ సమీపంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి కోనలో సోమవారం పంచ లింగాల గుడి వద్ద మంచినీటి కోనేరులో అపరిశుభ్రత తొలగించి, బ్లీచింగ్ పిచికారీ చేశామన్నారు. కాలినడకన సన్నిధానంలో వెళ్లే రహదారి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు పూర్తిగా తొలగిస్తామన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన నరేష్



పోలి నరేష్(ఫైల్)

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మంటపంపల్లి గ్రామ సమీపంలో కడప–చెన్నై జాతీయ రహదారిపై సోమవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన సంఘటనలో పోలి నరేష్ (30) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు..మండల పరిధిలోని నందానగర్‌కి చెందిన పోలి నరేష్(30), మునేంద్ర అనే ఇద్దరు వ్యక్తిగత పనుల నిమిత్తం రాజంపేటకు బజాజ్ పల్సర్ ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మంటపంపల్లి గ్రామ సమీపంలోకి రాగానే కడప–చెన్నై జాతీయ రహదారిపై వారి ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా ఉన్నట్టుండి ఎదురుగా లారీ రావడంతో రోడ్డు పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకెళ్లారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నడుపుతున్న మునేంద్ర రక్త గాయాలతో బయట పడగా, వెనుక ఉన్న నరేష్ తలకు పెద్ద రాయి తగులుకుని, తీవ్రగాయమైంది. క్షతగాత్రులను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించగా అక్కడికి చేరుకోగానే తలకు తీవ్రగాయమైన నరేష్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, పోలీసులు విచారిస్తున్నారు. మృతుడు నరేష్‌కు ఎనిమిదేళ్ల క్రితం అరుణ అనే మహిళతో వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు స్రవంతి(7), అను(6), హారిక(3) ఉన్నారు. కుటుంబ పెద్ద మరణంతో భార్యాబిడ్డలు అనాథలుగా మారారు.

దీపం.. విభిన్న రూపం!



- దీపావళికి దివ్వెలు సిద్ధం
- ఆకట్టుకుంటున్న ప్రమిదలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దివ్వెల విక్రయాల దుకాణాలు



దీపావళికి విక్రయాలకు సిద్ధంగా ఉంచిన దివ్వెలు





వివిధ రూపాల్లో దివ్వెలు

రాజంపేట టౌన్ : మరో వారం రోజుల్లో వెలుగులు వెదజల్లే దీపావళి పండుగ రానుంది. ఒకప్పుడు దీపావళి అనగానే అందరికి ఠక్కున గుర్తుకు వచ్చేది టపాసులు మాత్రమే. ఇంకా చెప్పాలంటే దీపావళి పండుగకు నెలరోజుల ముందు నుంచే చిన్న పిల్లలు చిన్నచిన్న టపాసులు కొనుగోలు చేసి కాల్చుతుండేవారు. అందువల్ల నెనెల రోజుల పాటు ఎక్కడో ఒక చోట టపాసుల శబ్దం వినిస్తూ ఉండేది. అయితే ఇప్పుడు కాలానుగుణంగా వచ్చిన మార్పుల వల్ల ప్రజల ఆలోచనా విధానం మారింది. దీనికి తోడు టపాసులు కాల్చడం వల్ల శబ్ద కాలుష్యంతో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ కారణంగా ప్రజలు టపాసులను కాల్చడం చాలా వరకు తగ్గించారనే చెప్పాలి. కేవలం దీపావళి రోజు మాత్రమే పిల్లల ఆనందం కోసం ప్రజలు టపాసులు కాల్చుతున్నారు. పర్యావరణ ప్రేమికులతో పాటు అనేక మంది విద్యావంతులు దీపావళి పండుగ రోజు కూడా టపాసులకు దూరంగా ఉంటున్నారంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి.

దీపాలతోనే దివాళీ..

టపాసులు కాల్చడం వల్ల కలిగే అనర్థాల గురించి తెలిసిన వారు దీపాలతోనే దివాళీ వేడుకలను జరుపుకుంటున్నారు. ఇక మహిళలు దీపాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అందువల్ల వ్యాపారులు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఆధునికతను, సాంకేతికతను కలబోస్తూ నేటి తరానికి నచ్చే రీతిలో అనేక డిజైన్లలో ఈ ఏడాది కూడా దీపాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. పండుగ సమీపిస్తుండటంతో ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా దివ్వెల విక్రయ దుకాణాలు ఒక్కొక్కటిగా వెలుస్తున్నాయి.

స్టేటస్‌కు తగ్గట్లుగా..

ప్రస్తుతం ఆధునికత కొత్త పుంతలు తొక్కుతోంది. అందువల్ల నూతనంగా ఇళ్లు నిర్మించుకున్న వారు, పాత ఇళ్లను రీమోడల్ చేసుకున్నవారు వారి ఆర్థిక స్థోమతను బట్టి ఇళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకుంటున్నారు. దీపావళి సందర్భంగా ఇంటి ముంగిట ఏర్పాటు చేసే దీపాలను తమ స్టేటస్‌కు తగ్గట్లు ఉండేలా ఆకర్షణీయమైన వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వ్యాపారులు కూడా ప్రజల అభిరుచికి అనుగుణంగా దీపాలను అందుబాటులో ఉంచారు. దీంతో మహిళలు తమ ఇంటి ముంగిట ఆకర్షణీయంగా ఉండే ప్రమిదలలో దీపాలను వెలిగించేందుకు మక్కువ చూపుతున్నారు. ఈ కారణంగా కొంత మంది కాస్త ఖరీదైనా సరే ఆకర్షణీయంగా ఉండే వెరైటీ దీపాలను కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఒకప్పుడు మట్టిదీపాలు మాత్రమే అందుబాటులో ఉండేవి. అయితే ఇప్పుడు మట్టి ప్రమిదలతో పాటు వివిధ రకాల మోడల్స్‌లో పింగాణి దీపాలు అందుబాటులో ఉన్నాయి. ఒక్కొక్క దీపం రూ.5 నుంచి రూ.200 వరకు ధర పలుకుతుంది. దీనికితోడు దీపావళి రోజు లక్ష్మీపూజ ఎంతో ప్రత్యేకమైనది. అందువల్ల వ్యాపారులు లక్ష్మీదేవి ప్రతిమలను కూడా అందుబాటులో ఉంచారు.

ఆకర్షణీయమైన దివ్వెలతో మరింత శోభ..



ఒకప్పుడు చిన్న మట్టి ప్రమిదలే అందుబాటులో ఉండేవి. అయితే ఇప్పుడు వివిధ మోడల్స్‌లో ఎంతో ఆకర్షణీయంగా ఉండే దివ్వెలు అందుబాటులోకి వచ్చాయి. ఇంటి ముంగిట ఆకర్షణీయమైన డిజైన్‌లలో ఉండే దివ్వెల్లో దీపాలను వెలిగిస్తే ఇళ్లు మరింత ఆకర్షణీయంగా మెరిసిపోతాయి.

– జి.మోహనవల్లీ, లెక్చరర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మదనపల్లె

హరిత దీపావళిని జరుపుకోవాలి..



దీపావళి సందర్భంగా టపాసులు కాల్చడం వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. అందువల్ల దీపావళి పండుగను దివ్వెలు వెలిగించి జరుపుకుంటే పర్యావరణానికి ఎంతో శ్రేయస్కరం. ప్రతి ఒక్కరు హరిత దీపావళిని జరుపుకోవాలి. టపాసులు కాల్చడం ద్వారా వచ్చే అధిక శబ్దాల కారణంగా కర్ణభేరి దెబ్బతిని వినికిడి లోపం వస్తుంది. అలాగే గుండెకు సంబంధించిన జబ్బులు ఉన్న వారికి గుండెపోటు కూడా వచ్చే ప్రమాదం ఉంది.

– జి.చక్రధర్‌రాజు, నేషనల్ గ్రీన్‌కోర్ రీజనల్ కో–ఆర్డినేటర్

ప్రేమ పేరుతో వేధింపులు

బాలిక ఆత్మహత్య

గాలివీడు : ప్రేమ పేరుతో వేధింపులు తాళలేక మండలంలోని పులికుంట పంచాయతీ గుంటి కాడపల్లెకు చెందిన బాలిక (14) ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తరచూ నేను నిన్ను ప్రేమిస్తున్నాను, నాతో మాట్లాడాలి అంటూ వేధింపులకు గురి చేసేవాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక అక్టోబర్ 9వ తేదీన తమ పొలం కోసం ఉంచిన గడ్డి మందును తాగింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ఏపీఎండీసీలో తారాస్థాయికి అవినీతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ సంస్థలో అవినీతి, అరాచక పాలన తారాస్థాయికి చేరిందని సీఐటీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, కార్యదర్శి రామాంజనేయులు ఆరోపించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏపీఎండీసీ సంస్థ ఏర్పడి దాదాపు 50 సంవత్సరాలు అయిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో జరిగిన అవినీతి, అన్యాయం ఎన్నడూ జరగలేదన్నారు. ఏ గ్రేడ్, బీ గ్రేడ్, సీ గ్రేడ్ ముగ్గురాయి ఖనిజం టెండర్లు పిలిచి దాదాపు సంవత్సరమైందని, యాజమాన్యం మౌనంగా ఉండటం వెనుక ఆంతర్యమేమిటని వారు ప్రశ్నించారు.

హంద్రీ నీవా కాలువలో విద్యార్థి మృతదేహం లభ్యం

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు
- మృతదేహాన్ని పరిశీలించిన డీవైఈఓ లోకేశ్వరరెడ్డి



సాయికిరణ్ మృతదేహం

మదనపల్లె రూరల్ : హంద్రీ నీవా కాలువలో గల్లంతైన పదోతరగతి విద్యార్థి రెబ్బాన సాయికిరణ్(15) మృతదేహం సోమవారం ఉదయం బసినికొండ సమీపంలో లభ్యమైంది. ఫైర్ రెస్క్యూ టీం హంద్రీ నీవా కాలువలో మునిగిపోయిన సాయికిరణ్ మృతదేహాన్ని బయటకు తీశారు. పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన సురేష్, సరళ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు సాయికిరణ్(16), బసినికొండలోని అభ్యుదయ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం స్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు ఉండటంతో, సాయికిరణ్ సాయంత్రం 4.30 వరకు క్లాసులు ఉన్నాయని తల్లిదండ్రులకు చెప్పి స్కూటీలో వచ్చాడు. మధ్యాహ్నం 1 గంట వరకు క్లాసుకు హాజరయ్యాడు. స్కూల్ వదిలాక నేరుగా ఇంటికి వెళ్లకుండా మెయిన్‌రోడ్డు వరకు వచ్చి, తర్వాత స్నేహితులైన భానుతేజ, శేషుబాబు, సాత్విక్‌రెడ్డితో కలిసి ఈత కొడదామని స్కూటీలో పాఠశాల వెనుక వైపు ఉన్న హంద్రీనీవా కాలువ వద్దకు చేరుకున్నారు. కాలువలో అప్పటికే కొందరు యువకులు ఈత కొడుతుండటం చూసి సాయికిరణ్ కాలువలోకి దిగాడు. అప్పటికే కాలువలో నీటిప్రవాహ ఉధృతి అధికంగా ఉంది. గమనించని సాయికిరణ్ కాలువలో ముందుకు వెళ్లడంతో పట్టుతప్పి పడిపోయాడు. కొట్టుకుపోతుండగా, శేషుబాబు, ఈత కొడుతున్న యువకులను కాపాడాల్సిందిగా కోరాడు. వారు వెంటనే అక్కడకు వచ్చి సాయికిరణ్‌ను పట్టుకునే ప్రయత్నం చేయగా, చేతికి చిక్కి జారిపోయాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, వారు అగ్నిమాపక సిబ్బందికి తెలపడంతో సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థి ఆచూకీ కోసం సాయంత్రం వరకు గాలించారు. చీకటికావడంతో గాలింపు చర్యలకు తాత్కాలిక విరామం ఇచ్చారు. సోమవారం ఉదయం ఫైర్ రెస్క్యూ టీం హంద్రీ నీవా కాలువలో గాలిస్తుండగా, బసినికొండ నగరవనం సమీపంలో సాయికిరణ్ మృతదేహం లభ్యమైంది. కుమారుడిని కాలువలో విగతజీవిగా చూసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

తాతలా దేశ సేవ చేస్తానని..

తాతలా దేశసేవ చేస్తానని చెప్పి కడుపుకోత మిగిల్చావేంటి తండ్రీ అంటూ తండ్రి తల్లడిల్లిపోయాడు. చదువులో, కరాటేలో అన్నింటిలో ఫస్ట్ వచ్చే బిడ్డ.. చావులోనూ మొదటే వెళ్లిపోయాడంటూ తల్లి గుండెలు బాదుకుంటూ ఏడవటం చూపరులను కలిచివేసింది. తాలూకా పోలీసులు విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుమారుడు సాయికిరణ్‌కు ఈత రాదని, ప్రమాదవశాత్తు కాలువలో మునిగిపోయాడా...? స్నేహితులు ఉద్దేశపూర్వకంగా కాలువలోకి తోశారా? స్నేహితులు గొడవపడ్డారేమోనన్న అనుమానం తండ్రి సురేష్‌కుమార్ వ్యక్తం చేశాడు. దీంతో తాలూకా ఎస్‌ఐ చంద్రమోహన్ విద్యార్థి మృతిపై అనుమానాస్పద మృతి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సెలవు దినాల్లో పాఠశాలలు నిర్వహించవద్దు..

ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గది వద్ద విద్యార్థి మృతదేహాన్ని డీవైఈఓ లోకేశ్వరరెడ్డి, ఎంఈఓ ప్రభాకరరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివారం, సెలవు దినాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఎలాంటి తరగతులు నిర్వహించవద్దని జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు జారీచేసి ఉన్నారన్నారు. అయితే నిబంధనలు అతిక్రమించి ప్రైవేట్ పాఠశాలలు స్పెషల్ క్లాసులు నిర్వహించడం, విద్యార్థి హంద్రీనీవా కాలువలో మృతి చెందడంపై పూర్తిస్థాయి నివేదిక ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి



మల్లెపూల అజయ్‌దేవా (ఫైల్)

మదనపల్లె రూరల్ : బైక్‌ను వేగంగా నడుపుతూ, వాహనాన్ని అదుపుచేయలేక, డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి మదనపల్లెలో జరిగింది. కోళ్లబైలు పంచాయతీ ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటున్న పవన్‌కుమార్, పల్లవి దంపతుల కుమారుడు మల్లెపూల అజయ్‌దేవా(19) స్థానికంగా ఫ్లిప్‌కార్ట్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో డెలివరీ అమౌంట్‌ను ఆఫీసులో చెల్లించి వస్తానని చెప్పి ఏపీ–40 హెచ్‌ఎం–5403 యమహా–ఆర్ 15 బైక్‌లో బయలుదేరి వెళ్లాడు. అమ్మచెరువుమిట్ట ఆంజనేయస్వామి గుడి సమీపంలోని మలుపు వద్ద రోడ్డుపై మట్టి ఉండటంతో బైక్ జారి అదుపుతప్పి డివైడర్‌ను వేగంగా ఢీకొన్నాడు. ప్రమాదంలో తలకు, శరీరంపై తీవ్ర గాయాలు కావడంతో అపస్మారకస్థితికి వెళ్లాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు.

మహిళా రైతు సూరం శ్రీదేవికి జాతీయ స్థాయి పురస్కారం



ప్రధాని చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న శ్రీదేవి

రామాపురం : ప్రకృతి వ్యవసాయంలో విశేష విజయాలు నమోదు చేసుకున్న రామాపురం మండలం నల్లగుట్టపల్లెకు చెందిన మహిళా రైతు సూరం శ్రీదేవికి జాతీయ పురస్కారం లభించింది.దీనదయాల్ అంత్యోదయ యోజన–నేషనల్ రూరల్ హుడ్స్ మిషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారం అందుకున్నారు. ప్రకృతి వ్యవసాయం విభాగం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, వెంకట మోహన్, పలువురు గ్రామీణ అభివృద్ధి అధికారులు శ్రీదేవిని అభినందించారు. సోమవారం రామాపురం ఆర్‌బీకేలో జరిగిన అభినందన సభలో మార్కెట్ కమిటీ చైర్మన్ షఫీ నాయక్, మాజీ చైర్మన్ రమేష్ రెడ్డిలు శ్రీదేవిని సన్మానించారు. మండల వ్యవసాయ అధికారి నాగమణి, ప్రకృతి వ్యవసాయ మండల మాస్టర్ ట్రైనర్ మధుకర్, మోడల్ మేకర్ సదాశివరెడ్డి, సూరం వెంకటరామిరెడ్డి, సుధాకర్, కదిరినిషా పాల్గొన్నారు.

మదనపల్లె పురపాలక సంఘము

ఆర్.ఓ.సి.నెం.1146/ఎ1/2011 **TENDER CUM AUCTION NOTICE** తేది: 13.10.2025

మదనపల్లె పురపాలక సంఘమునకు చెందిన వివిధ షాపింగ్ కాంప్లెక్స్ నందు క్రింద తెలిపిన ఖాళీగా వున్న షాపు రూములను **G.O. MS.No.68 (MA&UD)** ది:31.05.2024, నందలి ఆదేశముల ప్రకారము నెలసరి అద్దెపై లీజుకు ఇచ్చుటకు ది: 23-10-2025 తేదిన **TENDER CUM AUCTION** కార్యక్రమములో భాగంగా టెండరు నిర్వహించబడును. కావున సదరు **TENDER CUM AUCTION** నందు పాల్గొనదలచిన వారు ది: 22-10-2025 లోగ టెండరు రుసుము రూ. 100/-లను మున్సిపల్ ఖజానాలో చెల్లించి, మదనపల్లె పురపాలక సంఘంచే జారీ చేయబడిన టెండరు షెడ్యూలును ది: 23.10.2025 వ తేది ఉదయం 11:00 గం.ల లోగా దాఖలు చేయవలెను. టెండరు దాఖలు పరిచిన తదుపరి, టెండరు దారుల సమక్షంలో టెండర్లు తెరచి అదే రోజు బహిరంగ వేలము నిర్వహించబడును. ఒకటికన్న ఎక్కువ షాపు రూములు కావలసిన వారు ఒక్కొక్క షాపుకు ఒక్కొక్కటి విడివిడిగా టెండరు దాఖలు చేయవలెను.

వ. నెం.	ఏరియా/ కాంప్లెక్స్	ఖాళీగా ఉన్న షాపురూముల నెంబర్లు							
		జనరల్		షెడ్యూల్ కులాలు		షెడ్యూల్ తెగలు		వికలాంగులు	
		దిగువ షాపు రూములు	మొదటి అంతస్తు షాపు రూములు	దిగువ షాపు రూములు	మొదటి అంతస్తు షాపు రూములు	దిగువ షాపు రూములు	మొదటి అంతస్తు షాపు రూములు	దిగువ షాపు రూములు	మొదటి అంతస్తు షాపు రూములు
1.	జి.కే.వీధి	-	27, 27ఎ, 28ఎ,29, 29ఎ,30,34 35,39	-	33,33ఎ	-	-	-	-
2.	ముగ్గురాళ్ళ వంక	30,31,32	34,37,38 44,45,51 53,61,63 64	-	-	-	-	-	-
3.	చిత్తూరు బస్టాండు	10,11,15 17,బాత్ రూం గది	18,19,20, 24,26,28 29,30	16	22,27	08	-	09	33
4.	బెంగళూరు బస్టాండు	-	35ఎ,36ఎ 38ఎ	-	40	-	-	-	-
5.	కో–ఆప్ కాలనీ	5,6,8,10	-	11	-	9	-	-	-
6	సుబాష్‌రోడ్డు	1	-	-	-	-	-	-	-
7.	కొత్తగా నిర్మించిన చిత్తూరు బస్టాండు	3	-	-	-	-	-	-	-
8	ఆంధ్రకేసరి విపణి కల్ప	08 (హోటల్)	-	-	-	-	-	-	-

షరతులు:

1. దిగువ షాపు రూములు సాల్వెన్సీ రూ.1,00,000/– లు మరియు రూ.50,000/– లకు ధరావత్తును, కమిషనరు వారి పేరు పై డిమాండుడ్రాఫ్టును (చెక్కులు తీసుకోబడవు) సమర్పించవలెను.
2. మొదటి అంతస్తు షాపు రూములు సాల్వెన్సీ రూ. 50000/–లు మరియు రూ. 25000/– లకు ధరావత్తును, కమీషనరు వారి పేరు పై డిమాండు డ్రాఫ్టును (చెక్కులు తీసుకోబడవు) సమర్పించవలెను.
3. ఆంధ్రకేసరి విపణి కల్ప కాంప్లెక్స్ లోని 08 (హోటల్) కు సాల్వెన్సీ రూ. 10,00,000/–లు మరియు రూ.5,00,000/– లకు ధరావత్తును, కమీషనరు వారి పేరు పై డిమాండు డ్రాఫ్టును (చెక్కులు తీసుకోబడవు) సమర్పించవలెను.
4. టెండరు ఫారము పై నెలసరి అద్దెను స్పష్టముగా అంకెలులోను మరియు అక్షరములోను తప్పనిసరిగా వ్రాయవలెను.
5. నెలసరి అద్దెపై ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 18% శాతం GST అదనముగా చెల్లించవలసియుండును.

ఇతర వివరములు, షరతులు కార్యాలయ పనివేళయందు A1 వారిని సంప్రదించవచ్చును.

సం/– **కమిషనరు**, మదనపల్లె పురపాలక సంఘము

రహదారికి అడ్డంగా ప్రహరీ



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్న కృష్ణానగర్ వాసులు

- రాజంపేటలో టీడీపీ నేతల దౌర్జన్యం
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు



నివాసాలలోకి వెళ్లేందుకు వీలు లేకుండా నిర్మించిన ప్రహరీ

రాజంపేట రూరల్ : తమ ప్రభుత్వం అధికారంలో ఉందని.. తాము ఏ దారుణానికైనా ఒడిగడతామనే రీతిలో పలువురు కూటమి నేతలు వ్యవహరిస్తున్నారు. అందుకు నిదర్శనమే ఈ సంఘటన. రాజంపేట పట్టణంలోని కృష్ణానగర్‌లో నివాస గృహాలకు అడ్డంగా ప్రహరీ నిర్మించి వారికి ఇంట్లోకి వెళ్లేందుకు దారి లేకుండా చేశారు. దీనిపై స్థానికులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏఓ బి. శ్రీధర్‌రావుకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. 40 ఏళ్ల క్రితం వంకన సావిత్రమ్మ వద్ద సర్వే నెంబర్ 640లో గుణకల సుబ్బరాయుడు సతీమణి రామలక్ష్మితో పాటు మరో 10 మంది కలిసి దాదాపు 2 ఎకరాల స్థలం కొనుగోలు చేశారు. నాడు రాకపోకలకు గాను స్థలం వదులుకొని గృహాలను నిర్మించుకున్నారు. 1999లో గుణకల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో రహదారి నిర్మాణానికి పూనుకున్నారు. అయితే అది తమ స్థలం అని గుత్తా చెంగయ్యనాయుడు రహదారిని నిర్మిస్తున్న కాంట్రాక్టర్ మీద పిటీషన్ వేశారు. ఓఎస్ నెంబర్ 1999 జూలై 30న నందలూరు జడ్జి రహదారి నిర్మాణానికి అనుమతులు ఇచ్చినట్లు గుణకల సుబ్బరాయుడు తెలిపారు. అప్పటి నుంచి రహదారి నిర్మాణం చేపట్టినప్పుడల్లా గుత్తా చెంగయ్యనాయుడు కుటుంబీకులు అడ్డగిస్తూనే వస్తున్నారు. గతంలో పనిచేసిన తహసీల్దార్లు గుణ భూషణ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలు రహదారి నిర్మాణం చేసుకోవచ్చని అనుమతులు ఇచ్చినట్లు సుబ్బరాయుడు పేర్కొన్నారు. అలాగే అప్పటి రాజంపేట సబ్ కలెక్టర్ పద్మజ కూడా దగ్గరుండి రహదారి స్థలానికి కొలతలు వేయించి హద్దులు చూపుతూ నెంబర్ రాళ్లను నాటించారు. అయితే వాటిని గుత్తా కుటుంబీకులు వారం క్రితం పట్టపగలు జేసీబీతో తొలగించి తీసుకెళ్లినట్లు స్థానికులు తెలుపుతున్నారు.

దీనిపై రెండు వారాల క్రితం గుణకల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో స్థానికులు సబ్ కలెక్టర్ భావనను కలిసి తమ సమస్యను వివరించారు. దీంతో ఆమె చలానా కడితే మీ రెండు ఎకరాల స్థలానికి హద్దులు చూపిస్తానని తెలిపారు. అయితే సబ్ కలెక్టర్ సెలవులో వెళ్లిన విషయం పసిగట్టిన ఓ ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నేత చకచకా చక్రం తిప్పి అటు రెవెన్యూ అధికారులు, ఇటు పోలీస్ యంత్రాంగంతో మంత్రాంగం నడిపి ప్రహరీ నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చేశారు. తమ ఇళ్లకు వెళ్లేందుకు దారి లేకుండా దౌర్జన్యంగా ప్రహరీ నిర్మించిన వారిపై చర్యలు తీసుకుని తమకు రహదారి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కృష్ణా నగర్ వాసులు ఫిర్యాదు చేశారు.